క్లుప్తంగా

ఏపీ ఎన్జీవో ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నిడదవోలు తాలూకా యూనిట్- 2024 వార్షిక క్యాలెండర్‌ను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘాధ్యక్షుడు కె. నందిబాబు, జి. రాంబాబు, సీహెచ్ వెంకటేశ్వరరావు, పీవీ మాణిక్యాలరావు, జి.అప్పారావు, బి. కిషోర్, ఏఆర్ కే సుబ్రహ్మణ్యం, కె.నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పగిలి తాగు నీరు కలుషితం



చీపురుగూడెంలో డ్రైనేజీ, మంచినీరు పైపు లైన్లు పగిలి కలుషితమవుతున్న తాగునీరు

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెం పాత పోస్టాఫీసు బజారులో చెల్లు రాంబాబు ఇంటి వద్ద తాగునీటి పైపులైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పగిలిపోయాయి. వారం రోజులుగా మంచినీరు విడుదల అయ్యే సమయంలో డ్రైనేజీ వాటర్ అంతా తాగునీటితో కలిసిపోతోంది. దాంతో మంచినీళ్లు దుర్వాసన వస్తున్నాయని ఆ ప్రాంత వాసులు తెలిపారు. ఈ నీటితో రహదారి అంతా బురదగా మారి ప్రజలు నడవడానికి సైతం ఇబ్బందిగా ఉందని వారు వివరిస్తున్నారు. గ్రామ పంచాయతీ వారు ఈసమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి మెస్సైయరాజును వివరణ కోరగా సర్వేలో బిజీగా ఉన్నాం సోమవారం ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

చీపురుగూడెంలో ఫ్యామిలీ డాక్టర్



చీపురుగూడెంలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ వెంకట్రావు

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పోతవరం పీహెచ్‌సీ డాక్టర్ వెంకట్రావు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం గురించి వివరించారు. అనంతరం గ్రామంలో అపరిశుభ్ర ప్రాంతాలను పరిశీలించి ఆప్రాంత ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డాక్టర్ వెంకట్రావుతో పాటు హెల్త్ సూపర్‌వైజర్ ఎం.జయప్రకాష్, డి.ఆనంద్, ఆశ, ఏఎన్‌ఎం, ఎంఎల్ హెచ్‌పీ తదితరులు పాల్గొన్నారు.

కులగణన ప్రారంభం



ప్రక్కిలంకలో కులగణన చేస్తున్న వలంటీర్లతో మాస్టర్ ట్రైనీ వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన శుక్రవారం నుంచి మండలంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీవో టీబీ వెంకటరమణ, జిల్లా మాస్టర్ ట్రైనీ జె.వెంకటేశ్వరరావులు ప్రక్కిలంక, తాళ్లపూడి సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి కులగణనపై పలు సూచనలు చేశారు. భార్యాభర్తలు వేర్వేరు కులాల వారైతే అలాగే నమోదు చేయాలని సూచించారు. ఇంటి స్వభావం, నీరు, టాయిలెట్స్, భూమి, ఇంటి స్థలం వంటి మొత్తం 20 కాలమ్స్ అన్నింటినీ సమగ్రంగా పూర్తి చేయాలని వెంకటేశ్వరరావు సిబ్బందికి సూచించారు. తొలిరోజు చాలాచోట్ల యాప్ పనిచేయక సిబ్బంది కొంత ఇబ్బంది పడ్డారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ కవిత, వలంటీర్లు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు కళ్యాణ్ నగర్ ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దేవరకొండ మాణిక్యాన్ని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రణాళిక .. ప్రత్యేక బోధన

- టెన్త్ విద్యార్థులపై టీచర్ల ప్రత్యేక దృష్టి
- ఉత్తమ గ్రేడ్ సాధించేలా ప్రత్యేక శిక్షణ
- మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు



దూబచర్ల హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతి

నల్లజర్ల: విద్యార్థి దశలో పదో తరగతి ఉన్నత విద్యకు తొలిమెట్టు. ఈ క్రమంలో టెన్త్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని అటు ఉపాధ్యాయులు, ఉత్తమ గ్రేడ్ దక్కించుకోవాలని ఇటు విద్యార్థులు అవిశ్రాంతంగా కృషి చేస్తుంటారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి 30 వరకూ జరగనున్నాయి. గత నెల నుంచే పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. బృంద చర్చలకు ప్రాధాన్యం ఇస్తూ వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఈనెల 23 నుంచి ఫార్మెటివ్-3 పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 23 నుంచి ప్రి ఫైనల్ పరీక్షలు జరగున్నాయి. నల్లజర్ల మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలల్లో దాదాపు 750 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో టెన్త్ విద్యార్థులను పరీక్షలకు ఎలా సన్నద్ధం చేస్తున్నదీ ఉపాధ్యాయుల మాటల్లోనే..

వారిపై ఒత్తిడి లేకుండా..



డిసెంబరు నెల ముందు నుంచే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వత్తిడి లేకుండా విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా అవగాహన కల్పిస్తున్నాం. ఆయా సబ్జెక్టల పాఠ్యాంశాలను పునశ్చరణ చేస్తున్నాం. పరీక్షల సమయంలో అవలంభించాల్సిన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, దూబచర్ల

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఫార్మెటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం సబ్జెక్టుల వారీగా విద్యార్థులతో పునశ్చరణ చేయిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులు పురోగతి సాధించేలా మరింత సమయాన్ని కేటాయించి వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ముఖ్యంగా ఆంగ్లం, గణితం, భౌతిక శాస్త్రాల్లో సులభంగా మార్కులు సాధించే పద్ధతులు, మెళకువలను వారికి వివరిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహిస్తున్నాం.

– బి.సుమతి, హెచ్‌ఎం, దూబచర్ల జెడ్పీ హైస్కూల్

జగనన్న సురక్షలో 120 మందికి వైద్యం



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చాగల్లు: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య అన్నారు. బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు గారపాటి విజయదుర్గ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు తప్పని సరిగా ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు కె.నిశిత, దేవి రోగులకు 120 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఉసురుమర్తి జ్యోతి, ప్రత్తిపాటి సుబ్బారావు, పొన్నాడ సింహాద్రి, గురువెల్లి సత్యనారాయణ, వుండవల్లి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, సచివాలయం, వలంటీర్లు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ వాలీబాల్ పోటీలు ప్రారంభం



బ్రాహ్మణగూడెంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

చాగల్లు: యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ అన్నారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి వాలీబాల్ పోటీలను బ్రాహ్మణగూడెంలో శుక్రవారం ఆమె ప్రారంభించారు. మండలంలోని 18 సచివాలయాల నుంచి 18 జట్లు పోటీలో పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణగూడెంలో వాలీబాల్ కోర్టును అభివృద్ధి చేసిన గారపాటి విజయదుర్గా శ్రీనివాసరావును దుశ్శాలువా, పూలమాలలతో క్రీడాకారులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నిర్మలకుమారి, సర్పంచ్ గురువేల్లి కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు ఉసురుమర్తి జ్యోతి, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆవపాడుకు గోటితో ఒలిచే తలంబ్రాల ధాన్యం



ఆవపాడు వీహెచ్‌పీ సభ్యులకు గోటితో ఒలిచే తలంబ్రాల ధాన్యం అందజేస్తున్న దృశ్యం

నల్లజర్ల: శ్రీరామనవమి నాడు భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే తలంబ్రాల తయారీ ఇప్పటి నుంచే మొదలైంది. గోటితో ఒలిచే తలంబ్రాల తయారీకి అవసరమైన ధాన్యాన్ని శ్రీరామా ఆధ్యాత్మిక సేవాసమితి ఆధ్వర్యంలో ఆవపాడు విశ్వహిందూ పరిషత్ సభ్యులకు శుక్రవారం అందజేశారు. భజన మండలి సభ్యులందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సేవాసమితి సభ్యులు సవలం రామకృష్ణ, మాయలేడి తాతారావు సూచించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఆవపాడు శాఖ అధ్యక్షుడు మద్దూరి విష్ణుమూర్తి, ముత్యాలమ్మ తల్లి ఆలయ భజనమండలి సభ్యులు, కోడే చంటి, ఏనుగుదుర్గా ప్రసాద్, మద్దూరి నాగేశ్వరరావు, బదిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

‘స్వచ్ఛత యోజన’తో పారిశుధ్య కార్మికులకు ఉపాధి

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- రూ. 2.22 కోట్ల విలువైన ఏడు పారిశుధ్య వాహనాల మంజూరు
- లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే



మురుగుశుద్ధి వాహనాన్ని నడిపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: మున్సిపాలిటీల పరిధిలోని పారిశుధ్య కార్మికుల ఆర్థిక పురోభివృద్ధికి ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. స్వచ్ఛత ఉద్యమ యోజన కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2.22 కోట్ల వ్యయంతో పట్టణంలోని పారిశుధ్య కార్మికులకు ఏడు మురుగుశుద్ధి వాహనాలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం వాటిని లబ్ధిదారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన ఆ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ఐదుగురు సభ్యులు గల గ్రూపునకు రూ.31. 67 లక్షల విలువైన ఒక్కో మురుగుశుద్ధి వాహనాలు మంజూరయ్యాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య కుటుంబాల పోషణకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, చిలకల శారదాదేవి, పట్టణ పారిశుధ్య పర్యవేక్షకుడు సీహెచ్ ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర సాగు విధానాలతో రైతులకు మేలు

- వేలం నిర్వహణాధికారి ప్రసాద్
- వర్జీనియా పొగాకు రైతులకు అవగాహన సదస్సు



సంగాయగూడెంలో పొగాకు రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్

దేవరపల్లి: పొగాకు రైతులు సుస్థిర వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ క్యూరింగ్, గ్రేడింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం అధికారి జీఎల్‌కే ప్రసాద్ సూచించారు. మండలంలోని సంగాయగూడెంలో శుక్రవారం సాయంత్రం వర్జీనియా పొగాకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తోటల్లో ఆకురెలుపులు, క్యూరింగ్, గ్రేడింగ్, రెలుపుల అనంతరం యాజమాన్య పద్ధతులు, సుస్థిత వ్యవసాయం, పంట నియంత్రణపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేలం కేంద్రం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ రసాయన అవశేషాలు లేని నాణ్యమైన పొగాకు పండించాలన్నారు. అవసరానుగుణంగా సిపారసు చేసిన రసాయనాలను మాత్రమే తగు మోతాదులో పొగాకు తోటలకు వాడాలని రైతులకు సూచించారు. ఎగుమతుల ఆధారితమైన ఎన్‌ఎల్‌ఎస్ పొగాకును అనుమతించిన కోటా మేరకే పండించాలని స్పష్టం చేశారు. పుల్లటి నేలలు, లోతట్టు నేలల్లో పొగాకు సాగు చేయరాదని సలహా ఇచ్చారు. అటువంటి భూముల్లో సాగు చేస్తున్న రైతులకు నోటీసులు ఇచ్చి తగు చర్యలు తీసుకుంటామని ప్రసాద్ హెచ్చరించారు. పొగాకు వేలం కేంద్రంలో ఈ ఏడాది పండు గుల్ల కొనుగోలుకు అనుమతించినందున బయట అమ్మకాల లావాదేవీలను నిషేధించినట్టు చెప్పారు. మిచాంగ్ తుపాన్‌కు దెబ్బతిన్న పొగాకు తోటలకు పొగాకు బోర్డు సంక్షేమ నిధి నుంచి రైతులకు రూ.10 వేలు వడ్డీలేని రుణం ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ గ్రేడింగ్ అధికారి వి.శివకుమార్, ఐటీసీ ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, జీపీఐ కంపెనీ ప్రతినిధి రవికుమార్, పీఎస్‌ఎస్ కంపెనీ ప్రతినిధి టి.సీతారామరాజు, రైతు సంఘం నాయకులు ఆచటం గోపాలకృష్ణ, కరుటూరి శ్రీనివాస్, క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వంగడాలు, రైతుల హక్కులపై వర్క్‌షాప్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మొక్కల పరిరక్షణ, రైతుల హక్కుల అథారిటీ (పీపీవీ ఎఫ్‌ఆర్‌ఏ) ద్వారా అందుతున్న హక్కులను రైతులందరూ వినియోగించుకోవాలని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్‌ఐ) డైరెక్టర్, ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ యూనిట్ చైర్మన్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. స్థానిక కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ సెమినార్ హాల్లో శుక్రవారం రైతు వంగడాల మరియు హక్కుల పరిరక్షణ అనే అంశంపై ఆయన అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హైదరాబాద్ జన్యుశాస్త్రం వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ జె.సురేష్ మాట్లాడుతూ పీపీవీఎఫ్‌ఆర్‌ఏ ఆవిష్కరణ పాత్ర, రైతుల హక్కులు, రిజిస్ట్రేషన్ పద్ధతులు, హక్కుల ప్రచారం, ఆర్థిక ప్రయోజనాలు, రైతులకు భరోసా అనే అంశాలపై వివరించారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ హెచ్.రవిశంకర్ సీటీఆర్‌ఐ - ఐటీఎంయూ ముఖ్యఉద్దేశాన్ని వివరించారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాసంస్థ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ భారతీలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధికి మూలకారణమైన వంగడాల ప్రాముఖ్యతను వివరించారు. సీటీఆర్‌ఐ పంటల అభివృద్ధి విభాగాధిపతి డాక్టర్ కె.సరళ మాట్లాడుతూ పీపీవీఎఫ్‌ఆర్‌ఏ రైతు వంగడాల, హక్కుల ప్రాముఖ్యతను తెలిపారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.శ్యాంరాజ్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎం.మాధవరావు మాట్లాడుతూ నూతన వంగడాలు, అవగాహన సదస్సులు, ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు రైతులు చాలా ఉపయోగకరమని పేర్కొన్నారు.

సామాజిక న్యాయానికి జగన్ పెద్ద పీట



విజయవాడ వెళుతున్న బస్సులను దేవరపల్లిలో జెండా ఊపి ప్రారంభిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు




నిడదవోలు చర్చి పేటలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ఆవిష్కరణకు విజయవాడ భారీగా తరలివెళ్లిన దళితులు, బీసీలు
- జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు

దేవరపల్లి: విజయవాడలో నగర నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణకు గోపాలపురం నియోజకవర్గం నుంచి ఎస్సీ, బీసీ సామాజికవర్గాల ప్రజలను తీసుకు వెళుతున్న బస్సులకు దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబొడ్డున ప్రభుత్వం సుమారు 19 ఎకరాల విస్తీర్ణంలో రూ.404 కోట్ల వ్యయంతో అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పినప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పట్టుదలతో అంబేడ్కర్ మహాశిల్పం ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి 21 బస్సుల్లో ఎస్సీ, బీసీ సామాజికవర్గాల ప్రజలు, అంబేడ్కర్ యువజన సంఘాల సభ్యులు సుమారు 1000 మంది తరలి వెళ్లినట్టు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తిగా జగనన్న పాలన


నిడదవోలు: దేశానికే తలమానికంగా విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే స్ఫూర్తిదాయంగా నిలిచారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బస్సుల్లో వైఎస్సార్ సీపీ దళిత నాయకులు, దళితులు, యువత, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. నియోజకవర్గం నుంచి 18 బస్సుల్లో సుమారు 1,000 మంది విజయవాడకు తరలివెళ్ళారు. ముందుగా పట్టణంలోని చర్చిపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విజయవాడ వెళ్లే బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్ పర్సన్ యలగాడ బాలరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పుల్లారావు, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం జేమ్స్, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, పలువురు కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



చాగల్లు నుంచి బయలుదేరే బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ వీరాస్వామి

నల్లజర్ల: మండలంలోని వివిధ గ్రామాల నుంచి విజయవాడలో నిర్వహించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళుతున్న దళితులు,బీసీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కూడిన బస్సులను శుక్రవారం ఉదయం నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. తొలుత స్థానిక కొత్తపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మద్దిపాటి ప్రసాద్, బంక అప్పారావు, గగ్గర శ్రీనివాస్, ముప్పిడి వెంకటరత్నం, దూలపల్లి ప్రసాద్, పల్లి సుబ్బారావు, కంకిపాటి లక్ష్మణరావు, దుర్గారావు, ముప్పిడి రాజు, జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: విజయవాడలో శుక్రవారం నిర్వహించిన సామాజిక సమతా సంకల్ప సభకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలం నుంచి శుక్రవారం ఉదయం వైఎస్సార్ సీపీ శ్రేణులు, అంబేడ్కర్ అభిమానులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. చాగల్లు నుంచి మూడు బస్సులతో పాటు ఇతర వాహనాల్లో వారందరూ బయలుదేరి వెళ్లారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.



పెరవలిలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఉండ్రాజవరం: విజయవాడలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వేడుకకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ దళిత నాయకులు, అంబేడ్కర్ అభిమానులు తరలి వెళ్ళారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో ఐదు బస్సుల్లో సుమారు 220 మంది పయనమై వెళ్లారు. ఈ బస్సులను ఉండ్రాజవరంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, వేలివెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, పాలంగిలో ఎంపీపీ పి.యల్లారేశ్వరి జెండా ఊపి ప్రారంభించారు.

పెరవలి: మండలం నుంచి మూడు బస్సుల్లో 380 మంది విజయవాడకు బయలుదేరి వెళ్ళారు. ఈ బస్సులను పెరవలిలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా, మండల శాఖల అధ్యక్షులు పొట్టి రాంబాబు, బీరా రాజు పార్టీ నాయకుడు దొడ్డిగర్ల బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు బొకే వెంకటేశ్వర్లు, బావన మధు, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో దళితులు, వైఎస్సార్ సీపీ దళిత నాయకులు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. మండలం నుంచి ఐదు బస్సుల్లో 300 మంది వరకూ తరలి వెళ్లారు.ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, దళిత నాయకులు సిర్రా గంగారావు, పిట్టా శ్రీనివాస్, కె. ఆశోక్, ధర్మరాజు, వి.ఆశోక్ తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

పత్రిక ప్రకటన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు దేవరపల్లి, నల్లజర్ల మరియు గోపాలపురం మండలాలతో కలిపి కొత్తగా రవాణా శాఖ యూనిట్ కార్యాలయమును దేవరపల్లి కేంద్రముగా ఏర్పాటు చేయుటకు నిర్ణయించినారు. కావున కార్యాలయ కార్యకలాపాలు నిర్వహించుటకు సుమారు 2,500 SFT నుండి 3,000 SFT వరకు గల ఒక బిల్డింగ్ దేవరపల్లి ప్రాంతములో అద్దెకు కావలసియున్నది. కావున ప్రభుత్వ నిబంధనలకు లోబడి అద్దె/లీజు గా యిచ్చుటకు ఆసక్తి గల భవన యజమానులు జిల్లా రవాణా అధికారి, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా వారిని తగు పత్రములతో కార్యాలయ పని దినములలో త్వరితముగా సంప్రదించగలరు.

జిల్లా రవాణా అధికారి,
రాజమహేంద్రవరం